ఓంశ్రీసాయిరాం

దేహమే ప్రధానం, దేహికాదని భావించటము మానవుని ప్రథమ అజ్ఞానసూత్రం. అలలులేక సముద్రముండవచ్చును. అయితే, సముద్రములేక అలలు వుండవు. దేహనిమిత్తము ఆత్మ రాలేదు. ఆత్మనిమిత్తమే దేహము ప్రాప్తమయినది. దీనిని మానవులు విస్మరించుట వారు చేసే పెద్ద పొరపాటు.

ఆత్మ నిర్వికారము. షడ్వికారములన్నియూ దేహమునకే. జన్మించిన వ్యక్తి ఒక్కడే అయిననూ, నీటిపైబడిన నూనెబిందువువలె ఆ వ్యక్తి ఏకాకిగా జీవించుట కంగీకరించటములేదు. తన సంతోషమునకూ చేరిక వుంటే వుంటుంది. నేను అనే స్థానమునుంచి మనము అనే స్థానమునకు ప్రయాణము చేయునదే ఉత్తమ జీవితము. గత్యము, అగత్యము విధివిదానము వీటిని సద్బుద్ధియొక్క ప్రకాశనశక్తి ద్వారా తెలుసుకొని అట్టి వికాసమునకు మానవుడు పూనుకోవలెను. మానవుని సుఖశాంతి సౌభాగ్యములన్నియూ వాని బుద్ధిపైనే ఆధారపడివున్నవి. మానవుడు గాయత్రీ మంత్రముద్వారా ధీశక్తిని ప్రబోధించి, బుద్ధిని పరిశుద్ధముచేసి అభివృద్ధిపరచుకొనే చైతన్యస్వరూపుడైన పరమాత్మని ప్రార్థించుచున్నాడు. వేరేమి కోరుకోనక్కరలేదు. బుద్ధి నిర్మల నిశ్చల నిస్వార్థమైతే అన్నియూ దొరికినట్లే.

మానవుని బుద్ధిని గతజన్మల సంస్కృతి, ప్రారబ్ధబలము, అతని భవిష్యత్తు ఈ మూడూచేరి రూపొందించును. స్వార్థమునకై బుద్ధి వినియోగించబడిన, మోహాపేక్ష పెరుగును. పరార్థము కొరకు వినియోగింపబడిన, మోక్షాపేక్ష పెరుగును. తనతోబాటు అందరికీ మోక్షము ఆశించాలి. మనస్సు, ప్రాణము, చిత్తము, ఆత్మ ఈ క్షేత్రములను బుద్ధితో పరిశీలించి పరిశుద్ధపరచుటకు పూనుకొనవలయును. ప్రేమను దానము చేయాలి. అహంకారమును త్యాగము చేయాలి. సమాజసేవలో శౌర్యమును ప్రకటించాలి. దయాస్వరూపమైన హృదయముతో సమాజమున ఐక్యతాభావమును స్థిరపరచాలి. అందరిలోనూ ప్రకాశించుచున్న ఆత్మతత్త్వము సందర్శించి సంతోషించాలి.

శరీరధారియైన ప్రతివ్యక్తి అవతారస్వరూపుడే. అయితే, రామ, కృష్ణ, బుద్ధ, క్రీస్తు వీళ్ళ ఘనత ఏమిటి? మీకూ ఈ అవతారములకున్న భేదము ఒక్కటే. మరపు, యెరుక. మానవులకు ఆత్మస్మృతి లేదు. మాధవునికి సదా సర్వత్ర ఆ యెరుక వున్నది. దానివలననే, ఆ ప్రకాశము, ఆ ప్రతిభ, ఆ పరాక్రమము, ఆ సర్వశక్తి. అవతారములు దేశకాలపాత్రాదులకతీతము, జాగ్రత్స్వప్నసుషుప్తాదులకు అతీతము. సత్వరజస్తమో గుణములకతీతము. మానవులకు సుషుప్తిలో ఏ అనుభవమూ, ఏ ఆనందమూ గోచరించవు. స్వప్నములోని అనుభవములు వారికి సుషుప్తిలో లేవు. జాగృతిలోని అనుభవము, ఆనందము, సుఖదుఃఖములు స్వప్నములో లేవు. అన్నీ అనిత్యమే, అసత్యమే. అయితే, అవతారములకు ఈ అవస్థాత్రయములు లేవు. అవతారములు సచ్చిదానంద స్వరూపులు.

జీవితముయొక్క నిజస్వరూపము తెలుసుకొని, ఆ తెలివికి తగురీతిగా ప్రవర్తించువాడే బుద్ధిమంతుడు.

Life is a challenge, meet it!
Life is love, enjoy it!
Life is a dream, realise it!
Life is a game, play it!

ఇట్లు జీవించి జీవితమును కొనసాగించటమే, సరైన దిగ్విజయము. అరణ్యములో సింహము నిర్భయముగా సంచరించి విజయమును ఆర్జించురీతి, మానవుడు ధీరుడై, నిర్భీకుడై ఆత్మసామ్రాజ్యమునకు అభిషిక్తుడు కావలెను. సింహగర్జనమును శ్రవణము చేసిన తక్షణమే మృగములంతా దూరమునకు పరుగిడును. అట్లనే, ఆత్మతత్త్వ ప్రకాశము అంతఃకరణమును వెలిగించిన తక్షణమే ప్రకృతి సంబంధమైన భయభ్రాంతులు అదృశ్యమగును.

ప్రచండ మారుతమువలె కాలము కదలిపోవుచున్నది. జీవిత ప్రమాణము మంచుగడ్డవలె కరగిపోవుచున్నది. అయిననూ, జీవితముయొక్క సత్యమును, సార్థకతను మానవుడు గుర్తించటము జరగలేదు. అసతోమా సద్గమయ, తమసోమా జ్యోతిర్గమయ, మృత్యోర్మా అమృతంగమయ అని నోటితో కోరుచున్నాడేగాని, ఆ ప్రార్థనయొక్క ఫలితమును యేమాత్రం సాధించినాడు, దానివలన యెంత సంతృప్తి కలిగింది, అని పరికించిన, అందరికీ నిరాశయే కలుగును.

అవతారపురుషుల జన్మదినములందు వారిని ప్రత్యేకించి ఆరాధించిన ఫలితముండదు. ఆ పవిత్ర పురుషుల వాక్యరత్నములను హృదయములో దాచుకొని ఆచరణలో అందుకొని ఆనందించినప్పుడే ఆ ఆరాధన సార్థకమగును. లౌకిక ఆడంబరములు, ఆర్భాటములు కేవలము వ్యర్థమే, నిరర్థకమే. ఇకపైన మీమీ గృహములలో జన్మదినమును జరుపుకొని హృదయాలలో ఆదర్శాలను భద్రపరచుకొని ఆచరించండి, అంతేచాలు. ఆధ్యాత్మిక బీజమును హృదయమందు నాటుకొని ఆనంద ఫలము ఆరగించండి. అంతేచాలు. నిరాశకు గురికాక, అశాంతికి చోటివ్వక సంస్థల పెద్దలు ఆచరణరూపమైన ప్రబోధ ప్రచారణల ద్వారా ఆనందాభివృద్ధిచేసి అనుభూతులనందించండి.

మరొక విషయం. నేను మీకందించే వాక్యములనూ, సూక్తులనూ నేనే ఆచరించి బోధించుచున్నాను. నా లైఫ్ నా మెసేజ్.

మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథిదేవోభవ అని నేను బోధించుచున్నాను కదా! ఆ సూక్తుల ఆచరణే నాకు ఆనందము, తృప్తి. ఇపుడు నేను మాతాపితరుల సమాధికి వెళ్లి, తగురీతిగా గౌరవించి, తరువాత, ప్రశాంతిమందిరముపై ప్రశాంతి పతాకను యెగరవేయుచున్నాను. అయితే, మీరు మీ హృదయమునూ ప్రశాంతిమందిరముగా మార్చుకొని, దానిపై ఆ పతాకను యెగురవేసుకోవలెను. అపుడే మీకు ప్రశాంతి, శాశ్వితానందము.